క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద పొంగళ్లు వండుతున్న మహిళా భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

కొయ్యలగూడెం: స్థానిక నెయ్యల వారి వీధిలో (అశోక్ నగర్) కొలువైన శ్రీ పాదాలమ్మవారి ఆలయ 46వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులు పొంగళ్లను వండి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం నుంచి సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. తొలుత మల్లోలు రోడ్డులోని శ్రీనాగాలమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం పాదాలమ్మ ఆలయం వరకు భక్తులు పాదయాత్ర నిర్వహించారు. పాదాలమ్మకు బోనాల సమర్పించుకొని వార్షికోత్సవ జాతర కార్యక్రమం ప్రారంభించారు. సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యుడికి పూజలు



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదరణలో పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సుమారు రెండు వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన దాతలు సత్తి సత్యనారాయణరెడ్డి, వాసవి కన్యకపరమేశ్వరి దంపతులు, కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసినట్టు అన్నప్రసాద వితరణ కమిటీ తెలిపింది.

ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు



కుందవరపు పూజిత



నల్లగోపు సామ్యుల్ రాజు

జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురానికి చెందిన విద్యార్థిని కుందవరపు పూజిత, వేగవరానికి చెందిన విద్యార్థి నల్లగోపు సామ్యుల్ రాజు తొలి విడత జాబితాలోనే ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. శ్రీనివాసపురం జెడ్పీ హైస్కూల్‌లో చదివిన పూజిత 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు 571 మార్కులు సాధించి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, వేగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సామ్యుల్ రాజు పదో తరగతి చదివి 573 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల మండల స్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిచి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానికులు, తల్లిదండ్రులు అభినందించారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ క్రాంతి కుమార్

చింతలపూడి : విద్యాభారం, కుటుంబ ఒత్తిడులు వంటి సమస్యలతో మానసిక ఒత్తిడికి గురికావద్దని సీఐ క్రాంతి కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యువతలో పెరుగుతున్న సైబర్ నేరాలు, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం రక్షణ, ఆన్‌లైన్ మోసాలు, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కలిగించారు. ఎస్సై శ్రీ సతీష్ కుమార్ మాట్లాడుతూ హెల్ప్ లైన్ నంబర్లను తెలియ చేశారు. విద్యార్థుల్లో నైతిక స్థైర్యం, చట్టాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు మహిళల స్వీయ రక్షణ చర్యలపై మాట్లాడారు.

చెరువు వీధిలో చిమ్మ చీకట్లు

- నెల రోజులుగా వెలగని వీధి లైట్లు
- కంపుకొడుతున్న డ్రెయిన్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలోని చెరువు వీధిలో దాదాపు నెలరోజుల నుంచి ఒక్క వీధి లైటు కూడా వెలగడం లేదు. విష సర్పాల సంచరిస్తున్నాయి. దీంతో నృసింహ సాగరం లోపల వీధుల్లో ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట అడుగు బయట పెట్టేందుకు భీతిల్లుతున్నారు. ఒక వేళ ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే సెల్‌ఫోన్ లైట్ల వెలుగులే దిక్కవుతున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పంచాయతీ అధికారులు, పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చెరువు వీధిలో ఉన్న డ్రెయినేజీలు సంక్రాంతి పండుగ సమయాల్లో శుభ్రం చేశారు. మళ్లీ ఇప్పటి వరకు కనీసం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోయింది. కొన్నిచోట్ల మురుగు నీరు రోడ్లపై పారుతోంది. దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద ఎక్కువైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని, డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చిమ్మ చీకట్లో చెరువు వీధి



చెరువు వీధిలో ఓ ఇంటి వద్ద డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు



చెరువు వీధిలో సెల్‌ఫోన్ లైట్ వెలుగులో వెళుతున్న యువకుడు



వీధి లైట్లు వెలగక చీకటిగా ఉన్న చెరువు వీధి

ప్రజా సమస్యలపై పోరాటం



ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కొయ్యలగూడెం: ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా సీపీఎం ఉద్యమ బాట కొనసాగిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పేర్కొన్నారు. మంగళవారం ఆ పార్టీ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచుతూ, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్థలాలకు రూ.5 లక్షల మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, 10 గంటల పని రద్దు చేయాలని అన్నారు. పోలవరం రోడ్డు నుంచి గణేష్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తెల్లవారి రామకృష్ణ, గుడి వెంకట్రావు, జీవరత్నం, దుర్గారావు, నాగమణి, ఎస్ రాంబాబు, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి

కామవరపుకోట: వరి నారుమడిలో తెగుళ్ల రాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చింతలపూడి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ రైతులకు సూచించారు. కామవరపుకోట, కళ్లచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులతో కలిసి నారుమడులు పరిశీలించారు. నాగకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన నారు పెంచాలని, మడిలో తప్పనిసరిగా ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల తెగుళ్ల నుంచి సంరక్షించుకోవచ్చని సూచించారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకంలో భాగంగా సొంత భూమి గల ప్రతి రైతు కూడా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సందీప్, విష్ణువర్ధన్, పశుసంవర్ధక శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

చింతలపూడి : సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని మల్లాయగూడెం గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వెద జల్లే పద్ధతిలో సస్య రక్షణ చర్యలు గురించి మాట్లాడారు. వరి నారు మడిలో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. నారుమడిలో పచ్చ పురుగు నివారణకు నీమాస్త్రం తయారీ చేసి రైతుల సమక్షంలో డెమో చూపించారు. గ్రామ సర్పంచ్ చీకటి కవిత రమేష్, వర్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులతో వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

టార్పాలిన్లు అందజేయాలి

కొయ్యలగూడెం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ప్రభుత్వం వెంటనే రైతులకు టార్పాలిన్లు అందజేయాలని రైతులు కోరారు. ఏఓ కేవీఎస్ పోసారావు ఆధ్వర్యంలో గవరవరం, రాజవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సార్వా సీజన్ వరి విత్తనాలు మంచివే ఎంపిక చేసుకుని, అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఎంటీయూ 1318, పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1064 రకాలను వేసుకోవాలన్నారు. ఈ – పంట నమోదు, పీఎంఎఫ్‌బీవై బీమా చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు కౌలు అర్హత పత్రాలను రైతు సేవ కేంద్రం ద్వారా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పాడి పంటలకు సంబంధించిన బుక్ లెట్‌లను పశుసంవర్ధక, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు.

● బురదలో రాలేం.. పోలేం





గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుట్టాయగూడెం మండలంలోని గురుగుమిల్లి మీదుగా చింతకొండ వెళ్లే రహదారి బురదమయంగా మారింది. చింతకొండ కాలువ వద్ద రోడ్డు దుస్థితి ఇది. బురదమయంగా మారిన ఈ రహదారిపై ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి రోడ్డు పటిష్టతకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

– బుట్టాయగూడెం

న్యాయవాదుల నిరసన



జంగారెడ్డిగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 22న రేపల్లె మండలం పెనుమూడి గ్రామంలో సీనియర్ న్యాయవాది కొండపల్లి శ్రీనివాస్ దారుణ హత్యకు గురికావడం తీవ్ర దిగ్భ్రాంతిని గురిచేసిందని బార్ అసోసియేషన్ స్థానిక అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ శ్రీనివాస్ హత్యకు నిరసనగా 23, 24 తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఉపాధ్యక్షుడు మూడేపల్లి నాగులు, సీనియర్ న్యాయవాది నిమ్మగడ్డ రాంబాబు, పాశం సాయి ప్రతాప్‌లు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ట్రెజరర్ మానికల సూరిబాబు, లైబ్రరీ సెక్రటరీ బండారు లతాకుమారి, స్పోర్ట్స్ సెక్రటరీ సొబ్బన ఆనంద్, సీనియర్ న్యాయవాదులు మాడ రామ్మోహన్‌రావు, డీవీఆర్ కృష్ణ, రాయి వసంతరావు, వింజమూరి కిరణ్ కిషోర్, కురిమెళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్‌కు వైఎస్సార్ సీపీ నేతల సాయం

దెందులూరు: గోపన్నపాలెం పంచాయతీ మూడో వార్డు మెంబర్ యంత్రపాటి నాగమ్మకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దాతలు రూ.43 వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం గోపన్నపాలెంలోని బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి నగదును తోట పద్మారావు అందజేశారు. ఈ సందర్భంగా గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగ ఇన్‌చార్జి తోట పద్మారావు మాట్లాడుతూ బాధితురాలికి ఆర్థిక సాయమందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రచార విభాగపు ఇన్‌చార్జి తోట పద్మారావు సహృదయంతో వైఎస్సార్‌సీపీ గ్రూపులో బాధితురాలు అనారోగ్యం తెలియజేసి దాతలు ఇచ్చిన నగదును బాధితు రాలి కుటుంబానికి అందజేయడం ఈ 15 రోజుల్లో పద్మారావు పడిన శ్రమ చేసిన కృషిని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పురపాలక సంఘం పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్మికులకు ప్రతి నెలా జీతాలు ఆలస్యం అవుతూనే ఉన్నాయని, ప్రస్తుతం రెండు నెలలు గడుస్తున్నా ఇంకా జీతాలు చెల్లించేలని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభించి 10 రోజులు అయిందని, పిల్లలు స్కూల్, కాలేజీలలో చేర్పించేందుకు చేతిలో పైసలు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. కమిషనర్ వెంటనే స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్‌లు కోరారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, అయినాల ముత్యాలరావు, దోసూరి నాగరాజు, పారిశుధ్య విభాగం కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, కొత్తూరి నాగేశ్వరావు, పితాని సురేష్, కొత్తూరి శ్రీను, ఇంగుర్తి నాగరాజు, కొత్తూరి ఏమిలేశ్వరావు, కొత్తూరి నాగదుర్గారావు, ముప్పిడి సురేష్, యడ్లపల్లి ప్రసాద్, చాపల రమేష్, జాల వెంకటేశ్వరావు, దుద్దె సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాలకు ఉసిగొల్పడం సరికాదు



మహాసభల్లో మాట్లాడుతున్న గౌస్

జంగారెడ్డిగూడెం: ఆయుధ వ్యాపారమే లక్ష్యంగా అమెరికా యుద్ధాలకు ఉసిగొల్పుతోందని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే గౌస్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభల్లో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో తన ఆయుధ సంపత్తిని అమ్ముకొని అమెరికా ఆర్థికంగా లాభ పొందాలని ప్రయత్నిస్తుందని, చిన్న దేశాలను ఏదో ఒక సాకుతో యుద్ధంలోకి దింపడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహాసభల కొనసాగింపులో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వేల్పుల అర్లప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే గౌస్, కోశాధికారిగా సిరికొండ రామారావు, సభ్యులుగా బాచినేని సత్యనారాయణ, గద్దాల ముత్యాలరావు, వై.ఆశీర్వాదం, ఒక కో ఆప్షన్ సభ్యుని ఎన్నుకున్నట్లు గౌస్ వెల్లడించారు. కార్యక్రమంలో వి.ఆర్లప్ప, ఎస్ రామారావు, బి.సత్యనారాయణ, వై.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరవధిక దీక్ష



ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న శానిటరీ వర్కర్లు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ కార్మికులు గత పది రోజులుగా హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తున్నా అధికారులు కాంట్రాక్టర్ కనీసం స్పందించడంలేదని, దీంతో బుధవారం నుంచి విధులను బహిష్కరించి నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్టు చెప్పారు. శానిటరీ వర్కర్స్‌కి మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్, నాయకులు వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యపై వినతి



సోషల్ వెల్ఫేర్ జేడీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంక్షేమ హాస్టల్ విద్యార్థులు నిత్యం నడిచే స్థానిక అమీనా పేట బాలయోగి సైన్స్ పార్క్ రోడ్డును పునర్నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాకి నాని ఎస్ మహర్షి డిమాండ్ చేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సైన్స్ పార్క్ రోడ్డులో లోపల ఎస్సీ, బీసీ ప్రిమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాలికల హాస్టళ్లు ఉన్నాయని, సుమారు 2000 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ రోడ్డు గోతుల్లో వర్షం, డ్రెయినేజీ నీరు చేరి విద్యార్థులు నడవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిత్యం సోషల్ వెల్ఫేర్, విద్యుత్ అధికారులు కూడా ఈ మార్గంపై వెళ్తున్నప్పటికీ పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: ఈ నెల 25 నుంచి 27 వరకు ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఆర్‌కేఆర్ గూడెం ఫీడరుకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఏజెన్సీలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



పీఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో నిర్మిస్తోన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మంగళవారం ఐటీడీఏ పీఓ రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో అక్రమ కట్టడాలు తొలగించాలని అనేక సార్లు అధికారులకు వినతిపత్రం అందించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు కుంజా కృష్ణం రాజు, రవ్వా బసవ రాజు, పాడియం కవలయ్య, కొండరెడ్ల సంఘం నాయకులు పట్ల రమేష్ రెడ్డి, మల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతు రాంబాబు

కొయ్యలగూడెం : ఆరిపాటి (కనకాద్రిపురం) సమీపంలో కౌలు రైతు సుంకర రాంబాబుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ (రాగి) వైరును దొంగిలించారు. దుండగులు పంపు సెట్టును కూడా ధ్వంసం చేశారని రాంబాబు మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం సీసాల స్వాధీనం

కామవరపుకోట: మండలంలో కళ్లచెరువు గ్రామంలో చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని ఓ మహిళ వద్ద 180 ఎంఎల్ పరిమాణం గల 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

నాయకులకు సన్మానం

ఏలూరు(మెట్రో) : ఏలూరులో ఏపీఎన్‌జీవోస్ నాయకులను మంగళవారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సెక్రటరీలు సన్మానించారు. సచివాయాల్లో పనిచేస్తున్న వార్డు సెక్రటరీల బదిలీ మార్గదర్శకాల్లో మార్పులు చేసేందుకు ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు కృషి చేశారని వార్డు సెక్రటరీల బృందం తెలిపింది. జీఓకు కృషిచేసిన ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలను వార్డు సెక్రటరీల బృందం సత్కరించింది. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు.